సాక్షి గుంటూరు


I

శనివారం । 11 । జనవరి । 2025



ముక్కోటి ఏకాదశి పూజలు

దాచేపల్లి : ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం దాచేపల్లిలోని శ్రీ రంగనాయక స్వామి ఆలయంలో అర్చకులు కొనూరి రవి కుమార్ ఆధ్వర్యంలో పూజలు చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 565.60 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 9,567 క్యూసెక్కులు విడుదలవుతోంది.



తెనాలి రహదారికి మరమ్మతులు

తాడేపల్లి రూరల్ : మంగళగిరి – తెనాలి ఆర్ అండ్ బీ రహదారికి రెండో విడతలో శుక్రవారం మోరంపూడి నుంచి మంగళగిరి బైపాస్ వరకు మరమ్మతులు చేపట్టారు.

న్యూస్‌రీల్

16న అప్రెంటిస్ మేళా

తెనాలి రూరల్: తెనాలి చినరావూరు ఐటీఐలో ఈ నెల 16న అప్రెంటిస్ మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ రావి చినవెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ ఉత్తీర్ణులైన జిల్లాలోని అభ్యర్థులు హాజరుకావచ్చని, వివిధ కంపెనీలు ఎంపిక చేసుకుంటాయని పేర్కొన్నారు. అభ్యర్థులు నేరుగా సర్టిఫికెట్లతో హాజరుకావాలని ఆయన సూచించారు.

అంతర్జాతీయ యోగాలో విజయలక్ష్మికి రజత పతకం



గుంటూరు వెస్ట్ (క్రీడలు): పాండిచ్చేరిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ టూరిజం ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి 7 వరకు నిర్వహించిన 30వ ఇంటర్నేషనల్ యోగా ఫెస్టివల్‌లో గుంటూరుకు చెందిన గోలి విజయలక్ష్మి రజత పతకం గెలుపొందారు. 45–55 వయస్సు విభాగంలో ఈ పతకం గెలిచినట్లు ఆమె శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.అంతర్జాతీయ పతకం సాధించిన విజయలక్ష్మికి కుటుంబ సభ్యులతో పాటు యోగా సాధకులు అభినందనలు తెలిపారు.

డీజీపీకి న్యాయవాదుల వినతిపత్రం




నగరంపాలెం: ఇటీవల న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరుతూ శుక్రవారం డీజీపీ ద్వారక తిరుమలరావుకు మంగళగిరిలోని కార్యాలయంలో గుంటూరు, విజయవాడ బార్ ఫెడరేషన్ల ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఇటీవల న్యాయవాది సుదర్శనరెడ్డి, అనంతపురం జిల్లాలో ఓ న్యాయవాది మరణం, గుంటూరు జిల్లా పొన్నూరులో న్యాయవాది బేతాళ ప్రకాశ రావుపై పోలీసులు జరిగిన దాడులను డీజీపీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు ఆయన సానుకూలంగా స్పందించారని ఫెడరేషన్ల నాయకులు తెలిపారు. డీజీపీని కలిసిన వారిలో ఫెడరేషన్ అధ్యక్షులు కాసు వెంకటరెడ్డి (గుంటూరు), చంద్రమౌళి (విజయవాడ), బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజోన్నల బ్రహ్మారెడ్డి, సీనియర్ న్యాయవాది శాంతకుమార్, చల్లా క్రాంతికుమార్, న్యాయవాదులు ఉన్నారు.

18 వరకు గడువు పొడిగింపు

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య, ఆరోగ్య శాఖ సంచాలకుల కార్యాలయంలో కాంట్రాక్టు స్టాఫ్‌నర్సు ఉద్యోగాలకు ఈనెల 18వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆర్డీ డాక్టర్ కె.సుచిత్ర తెలిపారు. తొలుత ఈనెల 15 వరకు నోటిఫికేషన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ అని ప్రకటించామని పేర్కొన్నారు. ఈనెల 11 నుంచి 15వరకు వరుసగా ప్రభుత్వ సెలవులు ఉన్నందున 18వ తేదీ వరకు గడువును పొడిగించామని తెలిపారు. ఇప్పటి వరకు 3,530 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు.

యార్డులో 58,485 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 51,445 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 58,485 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ.15,200 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ.16,000 వరకు ధర లభించింది. ఏసీ కామన్ రకం రూ.7,200 నుంచి రూ.15,000 వరకు ధర పలికింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.7,500 నుంచి రూ.15,100 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.10,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 47,402 బస్తాలు నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు.

ముక్కోటి.. భక్తకోటి



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చిన శ్రీదేవి భూదేవి సమేత నారసింహుడు



శంఖుతీర్థం స్వీకరిస్తున్న భక్తులు

- కిటకిటలాడిన మంగళాద్రి
- ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చిన స్వామి
- వివిధ ప్రాంతాల నుంచి భక్తుల రాక

మంగళగిరి (తాడేపల్లి రూరల్): వైకుంఠ ఏకాదశి సందర్భంగా మంగళాద్రి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి శ్రీదేవి భూదేవి సమేతంగా బంగారు గరుడ వాహనంపై భక్తులకు ఉత్తర ద్వార దర్శనం ఇచ్చారు. శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు దర్శనం ప్రారంభమైంది. గురువారం రాత్రి జాగారణ ఉన్న భక్తులు శుక్రవారం తెల్లవారుజాము నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్తర ద్వార దర్శనంతో భక్తులు పోటెత్తారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయ పరిసరాలు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. దక్షిణ భారత దేశంలోనే ప్రసిద్ధి గాంచిన శ్రీదేవి భూదేవి సమేత నారసింహుని ఉత్తర ద్వారంలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు భక్తి పారవశ్యంలో మునిగి తేలారు. గురువారం రాత్రి బంగారు గరుడ వాహనంపై జగన్మోహిని అలంకారంలో గ్రామోత్సంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఆలయానికి చేరుకున్న స్వామివారికి ప్రత్యేక పూజలు, అలంకరణలతో తిరువంజనోత్సవం నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేతుడై బంగారు గరుడ వాహనంపై శుక్రవారం తెల్లవారుజామున ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పురాతన దక్షిణావృత శంఖంలో భక్తులకు అంతరాలయంలో తీర్థం అందజేశారు. స్వీకరించేందుకు భక్తులు బారులు తీరారు. పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు స్వామిని దర్శించుకుని శంఖుతీర్థం స్వీకరించారు.

ఉత్తర ద్వార దర్శనం.. సర్వ పాప హరణం



గోరంట్ల శ్రీవేంకటేశ్వర దేవస్థానంలో వైకుంఠ ద్వారంలో స్వామివారు



క్యూలైనులో భక్తులు (ఇన్‌సెట్‌లో) శంఖుతీర్థం

ముక్కోటి ఏకాదశి సందర్భంగా గోరంట్ల శ్రీవేంకటేశ్వర దేవస్థానంలో స్వామి ఉత్తర ద్వార దర్శనంలో భక్తులకు కనువిందు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు పవిత్ర శంకు తీర్థాన్ని అందించారు. తెల్లవారుజామునే స్వామి వారు, అమ్మవార్లను అలకరించి పల్లకిలో ఊరేగిస్తూ, మంగళ వాయిద్యాల నడుమ ఉత్తర ద్వార దర్శనానికి తొడ్కొని వచ్చారు.

సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

చిలకమ్మ ధాన్యం కొనుగోలు



సాక్షి స్పందన

తెనాలి: అనధికారికంగా రైతుల్నుంచి ధాన్యం కొనుగోళ్లను అధికారులు నిలిపివేశారు. రైతుల వద్ద నిల్వలున్నా పట్టించుకోవటం లేదు. ప్రైవేటు వ్యాపారులు బస్తా రూ.1300కూ కొనడం లేదు. రైతులేమో మద్దతు ధరకు ప్రభుత్వానికి అమ్మాలని చూస్తున్నారు. కొల్లిపర మండల గ్రామం తూములూరుకు చెందిన ఒంటరి మహిళా చాగంటి చిలకమ్మ కూడా బాధిత రైతుల కోవలోకి వస్తారు. ఆమె దగ్గరున్న మూడున్నర ఎకరాల్లోని ధాన్యం కూడా షెడ్డులో ఉంచుకుని నెలరోజులుగా కొనుగోలు చేయడం లేదు. రోడ్డు వెంట షెడ్డులో నిల్వచేసుకున్న ధాన్యాన్ని ఎలుకల బెడద నుంచి కాపాడుకునేందుకు చిలకమ్మ పడుతున్న కష్టాలు అన్నీఇన్నీ కావు. దీనిపై 'సాక్షి'లో శుక్రవారం ప్రచురితమైన 'చిలకమ్మ వ్యథ'కు అధికారులు స్పందించారు. గోతాలతో సహా వంపి మొత్తం 90 బస్తాల ధాన్యాన్ని బస్తా రూ.1740 చొప్పున కొనుగోలు చేశారు. దీనితో చిలకమ్మ 'సాక్షి'కి, ధాన్యం కొనుగోలు చేసిన అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 1818 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 80, బ్యాంక్ కెనాల్‌కు 148, తూర్పు కెనాల్‌కు 290, పశ్చిమ కెనాల్‌కు 120, నిజాంపట్నం కాలువకు 90, కొమ్మమూరు కాలువకు 523 క్యూసెక్కులు విడుదల చేశారు.

నారెడ్కో ప్రాపర్టీ షోను ప్రారంభించిన సీఎం



ప్రాపర్టీ షోను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

నెహ్రూనగర్: ప్రజల సొంతింటి కలను సాకారం చేయడానికి గుంటూరు నగరంలోని చేబ్రోలు హనుమయ్య కంపెనీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నారెడ్కో ప్రాపర్టీ షోను శుక్రవారం చంద్రబాబును ప్రారంభించారు. ఈ ప్రాపర్టీ షోలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సీతారామ్ గ్రూప్ స్టాల్‌ను ప్రారంభించి, సందర్శించారు. స్టాల్ వివరాలను గ్రూపు చైర్మన్ మామిడి సీతారామయ్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ ఈ ప్రాపర్టీ షోలో సీ– 1, సీ– 2, ఈ– 11 స్టాల్స్‌లో సీతారామ్ గ్రూప్ స్టాల్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తమ స్టాల్స్‌ను సందర్శించిన వారికి లక్కీ డ్రా నిర్వహించి ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తామని ప్రకటించారు. తమ వద్ద ప్లాట్ బుక్ చేసుకునే వారికి ప్రత్యేక తగ్గింపు ధరలు కూడా ఉంటాయని తెలిపారు. చదరపు అడుగు రూ.2999కు బుక్ చేసుకునే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అమరేశ్వరాలయంలో ఘనంగా ఉత్సవాలు

అమరావతి: స్థానిక ప్రముఖ శ్రీబాల చాముండికా సమేత అమరేశ్వరుని దేవాలయంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వేకువజామున ఆలయంలోని ఉత్తరద్వారం వద్ద భక్తులకు స్వామి వారి దర్శనాన్ని కల్పించారు. అనంతరం స్వామి వారి ఉత్సవ మూర్తులను రాజవీధికి అభిముఖంగా ఉన్న దక్షిణ గాలిగోపురంలో భక్తుల దర్శనార్థం ఉంచారు. తరువాత స్వామి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. అలాగే కోదండ రామ, పాండురంగస్వామి దేవాలయాలలో ఉదయాన్నే భక్తులు ఉత్తరద్వార దర్శనం చేసుకున్నారు. వైకుంఠపురంలో వేంకన్నను ఊరేగించారు.



గ్రామోత్సవంలో అమరేశ్వరుడు

రైల్వే ఎన్‌వోసీతో పని లేదు

- బహుళ అంతస్తుల భవన నిర్మాణదారులకు భారీ ఊరట
- రైల్వే ట్రాక్ వెంబడి నిర్మాణాలకు నిబంధనలలో మార్పులు
- సెట్‌బ్యాక్ పోర్షన్‌లోనూ సహేతుక సడలింపులు
- ఎన్‌వోసీల సాకుతో నిర్మాణాలను నిలిపివేసే మున్సిపాలిటీల అధికారాలకు కత్తిరింపు
- నిర్మాణ రంగానికి సంబంధించి తాజా ఉత్తర్వులు విడుదల చేసిన రాష్ట్ర మున్సిపల్ శాఖ



నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్) : రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ రంగానికి భారీ ఊరట కల్పిస్తూ జీఓను విడుదల చేసింది. 1955 ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ యాక్ట్ చట్టాన్ని సవరణ చేస్తూ శుక్రవారం ఆర్డర్‌ను పాస్ చేసింది. ఈ ఉత్తర్వులు 10వ తేదీ నుంచి అమలవుతాయని పేర్కొంది. ఈ జీఓలో ప్లాన్ మంజూరుకు లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్‌కే పూర్తిగా అధికారులు కల్పించడంతో పాటు పట్టణ ప్రణాళికకు అంత పని లేకుండా చేశారనే చెప్పకోవచ్చు.

రైల్వే ట్రాక్ వెంబడి పలు భవనాలు

గుంటూరు నగరం అంతా కూడా రైల్వే ట్రాక్‌ల వెంబడి ఉంది. అయితే, ట్రాక్‌ల వెంబడి ఉన్న భవన సముదాయాలలో ఒకటి నుంచి రెండు శాతం మాత్రమే రైల్వే ఎన్‌వోసీలు కలిగిఉన్నట్లు ఒక అంచనా. మిగిలిన వాటికి లేనట్టేనని తెలుస్తోంది. సహజంగా ఏదైనా బహుళ అంతస్తు నిర్మాణాలు చేపట్టాలంటే తప్పనిసరిగా రైల్వే ఎన్ఓసీ కావాల్సి ఉంటుంది. అయితే, శుక్రవారం విడుదల చేసిన జీఓలో రైల్వే, రక్షణ శాఖల నుంచి తీసుకోవాల్సిన ఎన్‌వోసీలకు సడలింపు ఇచ్చారు.

- ఈ జీవో ప్రకారం రైల్వే, రక్షణ శాఖలు ఇచ్చే ఎన్‌వోసీలు ఇక అవసరం లేదు. అంతేకాక, ఎన్‌వోసీలు సాకుతో భవన నిర్మాణాలను ఆపే అధికారం మున్సిపాలిటీల నుంచి తొలగించారు.
- మరో వైపు 500 చదరపు మీటర్లు పైన ఉన్న నివాస భవనాలకు సెల్లార్‌కు అనుమతిచ్చింది.
- లే అవుట్స్‌లో గతంలో 12 మీటర్ల వరకు రోడ్ల కోసం వదిలి పెట్టాల్సి ఉండగా..ప్రస్తుత జీఓలో దానిని 9 మీటర్లకు కుదించారు.

హై రేజ్ భవనాలకు భారీ ఉపశమనం

హైరేజ్ భవనాలకు సెట్ బ్యాక్ పోర్షన్‌లో భారీ ఉపశమనం కల్పించినట్లు మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ శుక్రవారం గుంటూరులో జరిగిన నారెడ్కో ప్రాపర్టీ షోలో ప్రకటించారు. 55 నుంచి 77 మీటర్ల ఎత్తు ఉన్న వాటికి 17 మీటర్లు, 70 నుంచి 120 మీటర్లు ఎత్తు ఉన్న వాటికి 18 మీటర్లు, 120 మీటర్లు ఆపైన ఉన్న వాటికి 20 మీటర్లు సెట్ బ్యాక్‌ను పరిమితం చేసినట్లు వెల్లడించారు. రహదారుల విస్తరణ సమయంలో స్థలాలు కొల్పోయిన వారికి టీడీఆర్ బాండ్లు జారీ చేయకపోయినా, కోల్పోయిన స్థలానికి సమానంగా వెంటనే నిర్మాణం చేసుకునే వెసులుబాటు ఇచ్చినట్లు తెలిపారు. ఐదు అంతస్తుల భవనాలకు సెల్ఫ్ డిక్లరేషన్‌తోనే భవన నిర్మాణ అనుమతులు ఇచ్చేలా జీఓను రెండు రోజుల్లో ఇవ్వనున్నట్లు మంత్రి చెప్పారు. దేశంలోనే తొలిసారిగా మున్సిపల్ శాఖ సర్వర్‌ను ఇతర శాఖ సర్వర్‌కు అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. మున్సిపల్ వెబ్‌సైట్‌లో నిర్మాణాలకు సంబంధించి ఫైర్, రెవెన్యూ, రిజిస్ట్రేషన్, మైనింగ్ శాఖలకు ఫీజులు చెల్లిస్తే సంబంధిత శాఖలకు వెళ్లేలా చేయనున్నట్లు వివరించారు. ప్లాన్ మంజూరు కూడా 15 రోజుల్లో ఇస్తామని, లేకపోతే డీమ్డ్‌గా అనుమతులు మంజూరయ్యే విధంగా సంబంధిత శాఖల అధికారులతో చర్చించి త్వరలోనే దానిని అమల్లోకి తీసుకు వస్తామని మంత్రి వెల్లడించారు.



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా



ర్యాలీగా వస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు



ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ..

అంగన్‌వేడీల నిరసన

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంపై అంగన్‌వాడీలు భగ్గుమన్నారు. గత నాలుగు రోజులుగా గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్నా పట్టించుకోక పోవడంపై మండిపడ్డారు. సహనం నశించి ఐసీడీఎస్ పీడీ కార్యాలయాన్ని ముట్టడించారు. ముందు బైఠాయించి నినాదాలు చేశారు. దీంతో అధికారులు దిగి వచ్చారు. పీడీ విజయలక్ష్మి ఆందోళనకారుల వద్దకు వచ్చి సమస్యల పరిష్కారానికి తక్షణమే సమావేశం ఏర్పాటు చేసి, యూనియన్ నాయకులతో చర్చిస్తామని హామీ ఇచ్చారు.

–లక్ష్మీపురం (II లో)

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 3,000 గరిష్ఠం : రూ. 4,000

మోడల్ ధర రూ. 3,500

క్లుప్తంగా

నేడు పోలీస్ పిల్లలకు ఉపకార వేతనాల పంపిణీ



యోగీష్ చంద్ర

కొరిటిపాడు(గుంటూరు): కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ గుంటూరు వారి ఆధ్వర్యంలో ఉన్నత విద్య అభ్యసిస్తూ, చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 115 మంది గుంటూరు జిల్లా పోలీసు సిబ్బంది పిల్లలకు రూ.5.95 లక్షల ఉపకార వేతనాలు పంపిణీ చేయనున్నట్లు తులసి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగీష్ చంద్ర శుక్రవారం తెలిపారు. గుంటూరులోని పోలీస్ కల్యాణ మండపంలో శనివారం సాయంత్రం 5గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతోందని పేర్కొన్నారు.

రేపు కాకతీయ సొసైటీ ఆధ్వర్యంలో...



గుంటూరు ఎడ్యుకేషన్: కాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 12న ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ.50 లక్షలు ఉపకార వేతనాలు పంపిణీ చేయనున్నట్లు సొసైటీ చైర్మన్ డాక్టర్ కొండబోలు బసవ పున్నయ్య తెలిపారు. జేకేసీ కళాశాల రోడ్డులోని కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 12న కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్న 22వ ఉపకార వేతన పంపిణీ కార్యక్రమంలో డిగ్రీ, పీజీ చదువుతున్న 300 మంది విద్యార్థులకు రూ.50 లక్షలు చెక్కుల రూపంలో పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

విజయకీలాద్రిపై వైకుంఠ ఏకాదశి ఉత్సవం



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



ఉత్తర ద్వారంలో దర్శనమిస్తున్న వైకుంఠ నాథుడు

తాడేపల్లి రూరల్: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం శ్రీ విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై శుక్రవారం స్వామివారి ఉత్తర దర్శన భాగ్యాన్ని భక్తులకు కల్పించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్‌స్వామి మంగళ శాసనాలతో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం ఎంతో వైభవంగా జరిగిందని తెలిపారు. ఉదయం 5.30 గంటలకు ఉత్తర ద్వార ప్రవేశం, అనంతరం వైకుంఠనాథస్వామి వారికి అష్టోత్తర శతనామార్చన, శ్రీ గోదా అమ్మవారికి పాసుర విన్నపం, తీర్థ ప్రసాద గోష్ఠి కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయని తెలిపారు. కార్యక్రమంలో విజయ డైరీ కృష్ణ మిల్క్ యూనియన్ చైర్మన్ ఆంజనేయులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

'బరి'తెగింపునకు సిద్ధం





సంక్రాంతి పండక్కి కొల్లిపర మండలంలో కోడిపందేల బరిని సిద్ధంచే స్తున్నారు. మండల గ్రామం బొమ్మువానిపాలెం సమీపంలో కృష్ణానది కరకట్ట దిగువన యుద్ధప్రాతిపదికన బరి ఏర్పాట్లు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వంలో తెనాలి నియోజకవర్గానికి ఇద్దరు నాయకులు ఉన్న విషయం తెలిసిందే. ఒకరు స్థానిక ఎమ్మెల్యే, ప్రస్తుతం రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రిగా ఉన్నారు. మరొకరు మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కూడా. ఇద్దరు నాయకుల్లో ఒకరు కోడపందేల బరికి అంగీకరించటం లేదని సమాచారం. మరొకరేమో... 'మీకెందుకు కానివ్వండి నేను చూసుకుంటా...' అంటూ అభయమిచ్చారట! మొత్తానికి కోడిపందేల బరి అయితే సిద్ధమవుతోంది. – తెనాలి

ఉత్సవమేదైనా ఖాకీలదే అత్యుత్సాహం !

- దర్శన వ్యవస్థ మొత్తం వారి ఆధీనంలోనే..
- సామాన్య భక్తులకు చుక్కలు
- దేవస్థాన సిబ్బందితోనూ వాగ్వివాదం

మంగళగిరి (తాడేపల్లి రూరల్): ఉత్సవం ఏదైనా ఆ సమయంలో భక్తులు ఎంతమంది వస్తారు? వారికి దర్శనం ఎలా కల్పించాలనే ? అంశంపై దేవదాయ శాఖ అధికారులు, ఆలయ ఉద్యోగులకు పూర్తి అవగాహన ఉంటుంది. సంప్రదాయాన్ని పాటిస్తూ భక్తులకు దర్శనం కల్పించడంపై వారంతా ముందుగా ప్రణాళిక సిద్ధం చేసుకుంటారు. రద్దీని నియంత్రించేందుకు, క్యూలైన్లు సక్రమంగా సాగేందుకు, తొక్కిసలాట వంటివి జరగకుండా పోలీసుల సహాయం తీసుకుంటారు. రెండు విభాగాల సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుంది. కానీ ఇందుకు విరుద్ధంగా పర్యవేక్షణను పోలీసులు తమ చేతుల్లోకి తీసుకుని, దేవదాయ శాఖ అధికారుల సూచనలను పక్కన పెట్టడం విమర్శలకు తావు ఇస్తోంది.



శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం వద్ద భక్తులతో వాగ్వివాదం చేస్తున్న పోలీసులు

పోలీసుల తీరుపై విమర్శలు

ముక్కోటి ఏకాదశి సందర్భంగా గుంటూరు జిల్లా మంగళగిరిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని ఉత్తర ద్వారంలో దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఏర్పాట్లు చేయడంలో ఆలయ అధికారుల వైఫల్యం, పోలీసుల తీరు భక్తులకు చుక్కలు చూపిస్తున్నాయి. తమకు తెలుసుకు వారిని, బంధువులను నిబంధనలకు విరుద్ధంగా పెద్ద సంఖ్యలో ప్రోటోకాల్, వీఐపీ ద్వారా దర్శనానికి పంపి పోలీసులు అత్యుత్సాహం చూపిస్తున్నారు. సామాన్య భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో నిల్చున్నా ఉపయోగం లేదంటూ వాపోతున్నారు. భక్తులు గతంలో ఎన్నడూ లేనంతా ఈసారి ఇబ్బందులు ఎదుర్కోవడానికి అధికారుల నిర్ణయాలతో పాటు పోలీసుల తీరు ఒక కారణమని విమర్శలు ఉన్నాయి. స్థానిక పోలీస్ అధికారుల కంటే బయట నుండి వచ్చిన పోలీసులే హడావుడి చేయడంలో డిపార్ట్‌మెంట్‌లోనే గుసగుసలు వినబడుతున్నాయి.

ఈవోతోనూ వాగ్వివాదం

ప్రధాన గోపురం ఎదురుగా ఉన్న వీఐపీ గేటు వద్ద బయట నుంచి ఓ అధికారి భక్తులపై రుసరుసలాడడంతో పాటు దేవదాయ శాఖ సిబ్బంది, కార్యనిర్వహణాధికారిపై సైతం వాగ్వివాదానికి దిగడం చర్చనీయాంశమైంది. సమయపాలన లేకుండా వీఐపీల కోసం ఎప్పుడు పడితే అప్పుడు సామాన్య భక్తుల క్యూలైన్స్‌లను నిలిపివేసి ఇబ్బంది కలిగించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూలైన్‌లో గంటల తరబడి నిలబడుతూ నరకం అనుభవించారు.

అర్చకులపై పెచ్చుమీరిన దాడులు

ఏపీ ప్లానింగ్ బోర్డు మాజీ వైస్ చైర్మన్ మల్లాది విష్ణు



పొన్నూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అర్చకులు, బ్రాహ్మణులపై దాడులు పెచ్చుమీరాయని ఏపీ ప్లానింగ్ బోర్డు మాజీ వైస్ చైర్మన్ మల్లాది విష్ణు శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. దేవుడి సేవకు అంకితమైన అర్చకులు, పురోహితులపై దాడులకు తెగబడటం బాధాకరమని తెలిపారు. పొన్నూరు శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయం అర్చకుడిపై దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. జూలై 28న చిత్తూరు చెంగలరాయకొండపై వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ అర్చక కుటుంబంపై టీడీపీ నేత లోకేష్ చేసిన దాడి, సెప్టెంబర్ లో తెనాలి నాజరుపేటలో కృష్ణ మందిర నిర్మాణం చేపట్టిన బ్రాహ్మణ కుటుంబంపై టీడీపీ గూండాల దాడి ఘటనలే ఇందుకు నిదర్శనమని తెలిపారు. అర్చకులపై దాడులకు పాల్పడేవారు ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పొన్నూరు ఘటనలో నిందితులను తక్షణమే అదుపులోకి తీసుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బ్రాహ్మణులు, అర్చకులపై మరోసారి ఇలాంటి దాడులు జరగకుండా కఠినతర చట్టాలు తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

'ఒక జిల్లా ఒక ఉత్పత్తి' పై కేంద్ర బృందం అధ్యయనం

- గుంటూరు మిర్చి యార్డు సందర్శన
- అధికారుల నుంచి వివరాల సేకరణ

కొరిటిపాడు(గుంటూరు): 'ఒక జిల్లా ఒక ఉత్పత్తి'లో భాగంగా గుంటూరు జిల్లా మిర్చి పంటపై ఢిల్లీ పీఎంఓ ఆఫీసులో ఓడీఓఎఫ్ విభాగంలో పనిచేస్తున్న అధికారులు డాక్టర్ ఇషదీప్, డాక్టర్ దివ్యలు శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగలక్ష్మి, అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్‌లను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్, జిల్లా రైతులు పండించిన కొన్ని మిరప రకాలను వీక్షించారు. ఓడీఓపీ డాక్యుమెంటేషన్‌పై చర్చించారు. కార్యక్రమానికి జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ అధ్యక్షత వహించారు. ఆ తర్వాత డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ, లాఫారంను సందర్శించారు. మిరప రకాలు, చేపడుతున్న ప్రాజెక్టుల గురించి తెలుసుకున్నారు. లాం ఆర్‌ఎస్‌కేని సందర్శించి, డిజిటల్ గ్రీన్ వారు రైతులకు అందిస్తున్న సేవల గురించి వాకబు చేశారు. అనంతరం అంకిరెడ్డిపాలెంలో ఉద్యాన శాఖ ద్వారా రాయితీ పొందిన విశ్వసాయి ఫుడ్స్ అండ్ కోల్డ్‌స్టోరేజీని సందర్శించారు. రైతులకు ఎలాంటి ప్రయోజనం కలుగుతోంది ? రైతులకు ఏ విధంగా స్టోరేజ్‌లు ఉపయోగపడతున్నాయో ? విపులంగా తెలుసుకున్నారు. అనంతరం గుంటూరు మిర్చి యార్డు, చుట్టుగుంటలోని స్పైసెస్ బోర్డు కార్యాలయంను సందర్శించి, వారు చేపడుతున్న ప్రాజెక్స్‌ను అడిగి తెలుసుకున్నారు. మిర్చి యార్డులో విస్తృతంగా పర్యటించారు. సాగులో ఉన్న మిర్చి రకాలు, ధరలు, సీజన్ వ్యవధి, రోజుకు వస్తున్న బస్తాలు, ఏఏ జిల్లాల నుంచి గుంటూరు యార్డుకు మిర్చి వస్తుందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్పైసెస్ బోర్డు కార్యాలయంలోని మిరప టెస్టింగ్ ల్యాబ్‌ను సందర్శించారు. మిర్చి పండించే రైతులు, మిర్చి ఎగుమతిదారులకు ల్యాబ్ వల్ల కలిగే ప్రయోజనాలను అధ్యయనం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి బి.రవీంద్రబాబు, యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు, డాక్టర్ రమణ, శారద పాల్గొన్నారు.



మిర్చి యార్డులో అధికారుల నుంచి వివరాలు సేకరిస్తున్న డాక్టర్ ఇషదీప్, డాక్టర్ దివ్య, స్వప్నిల్ తదితరులు

మధ్యవర్తిత్వంపై న్యాయమూర్తులకు ముగిసిన శిక్షణ



జిల్లా ప్రధాన న్యాయమూర్తితో శిక్షకులు, న్యాయమూర్తులు

నగరంపాలెం: జిల్లా కోర్టు ఆవరణలో గత ఐదు రోజులుగా మధ్యవర్తిత్వంపై గుంటూరు, ప్రకాశం, పీఎస్ నెల్లూరు జిల్లాలో ఎంపిక చేసిన న్యాయమూర్తులకు నిర్వహిస్తోన్న నలభై గంటల శిక్షణ శుక్రవారంతో ముగిసింది. సుప్రీంకోర్టు మీడియేషన్, కాన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ (న్యూఢిల్లీ), రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి అధ్యక్షత వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి మాట్లాడుతూ మధ్యవర్తిత్వం పూర్తిగా కక్షిదారుల స్వచ్ఛంద ప్రక్రియ అన్నారు. సమస్య పరిష్కారంలో వారే కీలక పాత్రదారులని పేర్కొన్నారు. మధ్యవర్తిత్వంలో కక్షిదారుల ప్రయోజనాలకే ప్రాముఖ్యత ఉంటుందని, అనుకూలమైన రీతిలో కేసుల్ని పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. రాజీపడితే కోర్టు ఫీజులు తిరిగి చెల్లిస్తారని ఆయన తెలిపారు. అగ్రిమెంట్ రాసుకుని రాజీ అయితే జడ్జిమెంట్ కూడా అలాగే వస్తోందని చెప్పారు. నలభై గంటల శిక్షణను న్యాయమూర్తులు విజయవంతం చేశారని ప్రశంసించారు. ఐదు రోజులు న్యాయమూర్తులకు తర్ఫీదు ఇచ్చిన రాజస్తాన్, కేరళ రాష్ట్రాలకు చెందిన ఆచార్య అడ్వకేట్ ప్రమీల, అడ్వకేట్ వి.పి.తంకచన్‌లను సత్కరించారు.

జిల్లా సబ్ జూనియర్ బాలుర హాకీ జట్టు ఎంపిక



గుంటూరు ఎడ్యుకేషన్: మార్కెట్ సెంటర్‌లోని హిందూ కాలేజీ హైస్కూల్లో శుక్రవారం గుంటూరు జిల్లా సబ్ జూనియర్ బాలుర హాకీ జట్టు ఎంపికలను నిర్వహించారు. ఎంపిక ప్రక్రియను హిందూ కాలేజీ హైస్కూల్ కౌన్సిల్ కార్యదర్శి కేఎస్సార్ కుటుంబరావు, ఏపీ హాకీ డైరెక్టర్ ఎం.నిరంజన్‌రెడ్డి పర్యవేక్షించారు. వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఎంపిక చేసిన జిల్లా జట్టు ఈనెల 17,18,19వ తేదీల్లో మదనపల్లెలో జరగనున్న 14వ ఏపీ సబ్ జూనియర్ బాలుర అంతర్ జిల్లా పోటీల్లో పాల్గొంటుందని హాకీ గుంటూరు జిల్లా కార్యదర్శి ఎం. అజయ్‌బాబు తెలిపారు.

సైనేడ్ హత్య కేసులో తల్లీకూతుళ్ల అరెస్ట్

తెనాలి రూరల్: ఇటీవల సంచలనం సృష్టించిన వరుస సైనేడ్ హత్య కేసుల్లో నిందితులైన తల్లీకూతుళ్లను పోలీసులు శుక్రవారం మరోసారి అరెస్ట్ చేశారు. పట్టణ యడ్ల లింగయ్య కాలనీకి చెందిన వెంకటేశ్వరి, ఆమె తల్లి రమణమ్మలు సైనేడ్‌తో పలువురిని హత్య చేశారు. ఇటీవల అరెస్టు అయి రిమాండ్‌లో ఉండి బెయిల్‌పై విడుదలైన సంగతి తెలిసిందే. సైనేడ్ హత్యలు వెలుగులోకి రావడంతో ఇదే కాలనీకి చెందిన కొవెవరపు మోషే అలియాస్ పీసు మృతిపై అనుమానం ఉందంటూ అతని కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్టోబర్ 4న కొల్లిపర మండలం హనుమాన్‌పాలెంలో మోషేని ఖననం చేసిన ప్రాంతంలో శవాన్ని వెలికి తీసి పోస్ట్‌మార్టం నిర్వహించారు. ఇందులో సైనేడ్ వల్ల మృతి చెందినట్టు పోలీసులకు ఫోరెన్సిక్ రిపోర్టు వచ్చింది. తల్లీ కూతుళ్లను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

అంగన్‌వాడీల పోరుబాట

- ఐసీడీఎస్ పీడీ కార్యాలయం ముట్టడి
- బైఠాయించి నినాదాలు

లక్ష్మీపురం: అర్హులైన హెల్పర్లకు ప్రమోషన్ల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించి ఏడాది పైగా అయినా ఇంతవరకు పోస్టులు ఇవ్వకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆర్.రేఖ అన్నారు. గత నాలుగు రోజులుగా కలెక్టర్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు నిరాహార దీక్షలు చేస్తున్న సంగతి తెలిసిందే. శుక్రవారం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు కుమారి అధ్యక్షతన ఐసీడీఎస్ పీడీ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయం ముందు బైఠాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ఎప్పటికప్పుడు ఖాళీ అయిన పోస్టులను గుర్తించి ఇంటర్వ్యూలు నిర్వహించి, పోస్టులు భర్తీ చేస్తున్నారన్నారు. గుంటూరు జిల్లా అధికారులు మాత్రం జిల్లాలో నూట పది పోస్టులు ఖాళీ ఉన్నప్పటికీ ఎందుకు భర్తీ చేయట్లేదని ఆమె ప్రశ్నించారు. జిల్లాలో 39 మంది వర్కర్స్, 66 మంది హెల్పర్ పోస్టు ఖాళీగా ఉండటం వల్ల ఆయా సెంటర్లకు వచ్చే పిల్లలు ఏమి నేర్చుకోవాలని నిలదీశారు. ప్రభుత్వం ఇచ్చిన సెల్ ఫోన్లు సక్రమంగా పనిచేయకపోతుంటే, వాటిని మార్చడానికి బదులు అధికారులు మెమోలు ఇచ్చి వేధించటం సరికాదని తెలిపారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వై. నేతాజీ మాట్లాడుతూ అంగన్‌వాడీలు రాష్ట్రవ్యాప్తంగా 42 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, మట్టి ఖర్చులు జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమ్మర్ హాలిడేస్ అంగన్‌వాడీ సెంటర్లకు కూడా వర్తింపజేయాలని కోరారు, మినీ సెంటర్లను మెయిన్ సెంట్రల్‌గా మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి దీప్తి మనోజ, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ, నాయకులు బి. లక్ష్మణరావు, బాబు ప్రసాద్, హుస్సేన్ వలి ప్రసంగించారు.

పండుగ తరువాత సమస్యలు పరిష్కరిస్తాం

ఐసీడీఎస్ పీడీ విజయలక్ష్మి ఆందోళనకారుల వద్దకు వచ్చి సమస్యలపై చర్చించారు. పండుగ సెలవుల అనంతరం ఇంటర్వ్యూలో నిర్వహించిన హెల్పర్లందరికీ పోస్టింగులు ఇస్తామన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న వర్కర్ పోస్టులకు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక సమస్యల పరిష్కారానికి తక్షణమే సమావేశం ఏర్పాటు చేసి యూనియన్ నాయకులతో చర్చిస్తామని హామీ ఇచ్చారు.


ఉద్యమ బాటలో న్యాయవాదులు

- గుంటూరు జిల్లా కోర్టు ఎదుట దిష్టిబొమ్మల దహనం
- కోర్టు గేట్లకు తాళాలు వేసి రిలే నిరాహార దీక్షలు




నగరంపాలెం(గుంటూరు వెస్ట్) : గత నాలుగు రోజులుగా న్యాయవాదులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం ఉద్రిక్తతకు దారి తీశాయి. గుంటూరు జిల్లా పొన్నూరు న్యాయవాది బేతాళ ప్రకాశరావుపై పొన్నూరు పట్టణ సీఐ, ఎస్‌ఐ, ముగ్గురు కాని స్టేబుళ్లపై చర్యలు తీసుకోవాలంటూ గుంటూరు జిల్లా కోర్టు ప్రధాన ద్వారం వద్ద న్యాయవాదులు రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం సీఐ, ఎస్‌ఐల దిష్టిబొమ్మలను దహనం చేశారు. దీంతో కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కోర్టు ప్రధాన ద్వారం, మిగతా గేట్లకు తాళాలు వేశారు. న్యాయమూర్తులు, కోర్టు సిబ్బందిని మాత్రమే లోనికి అనుమతించారు. కోర్టులోకి కెళ్లేందుకు కక్షిదారులు, పోలీసులు పలువురు ఇబ్బందులకు గురయ్యారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా గుంటూరు బార్ ఫెడరేషన్ చైర్మన్ కాసు వెంకటరెడ్డి మాట్లాడుతూ పోలీసులపై చర్యలు తీసుకోకపోతే భవిష్యత్ కార్యచరణను రూపొందిస్తామని తెలిపారు. మహిళా న్యాయవాది ఝాన్సీ మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా న్యాయవాదులు విధులకు బహిష్కరణ, రిలే నిరాహార దీక్షలు చేస్తున్న జిల్లా ఎస్పీ స్పందించపోవడం దారుణమని వాపోయారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ పోలీసులను సత్వరమే సస్పెన్షన్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు జి.శాంతకుమార్, పోలూరి వెంకటరెడ్డి, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గౌరీశంకర్, న్యాయవాదులు టి. ఆనంద్, మదిర నాగేశ్వరరావు, సొపాటి బాబు, సందీప్, క్రాంతి, షేక్ జిలాని, సత్యం, చల్లా క్రాంతికుమార్ పాల్గొన్నారు.

కళా పరిషత్ నాటక సంబరాలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న అతిథులు



జనరల్ బోగీలు నాటికలో సన్నివేశం

నగరంపాలెం: గత 26 ఏళ్లుగా గుంటూరు కళా పరిషత్‌ను ఆదరిస్తోన్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు గుంటూరు కళాపరిషత్ అధ్యక్షుడు పి.వి.మల్లిఖార్జునరావు అన్నారు. మూడు రోజులపాటు జరిగే కళాపరిషత్ 27వ వార్షిక నాటకోత్సవాల ప్రారంభ సభ శుక్రవారం రాత్రి మార్కెట్ కూడలిలోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించారు.ఈ సందర్భంగా సమయ పాలనను కచ్చితంగా పాటిస్తూ, కళా పరిషత్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రముఖ వైద్యులు యెండ్లూరి సీతారామాంజనేయులు మాట్లాడుతూ వాస్తవికమైన కథాంశాలతో సాగుతున్న నాటక రంగాన్ని ప్రేక్షకులు బాగా ప్రోత్సహించాలని కోరారు. ప్రముఖ రంగస్థల నటుడు వేముల మోహనరావు మాట్లాడుతూ నిబ్ధతతో రాష్ట్రానికే తలమానికంగా కళా పరిషత్ నిర్వహిస్తున్నారని తెలిపారు. కళా పరిషత్ ప్రధాన కార్యదర్శి బి.పూర్ణ తదితరులు మాట్లాడారు. రచయిత షేక్ సైదా, ప్రజా నాట్య మండలి నాయకులు కొండలరావు దేశభక్తి గీతాలు ఆలపించారు. తొలుత విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో స్వేచ్ఛ నాటికను ప్రదర్శించారు. పి.ఎస్.నారాయణ మూలకథ అందించగా, పరమాత్ముని శివరామ్ నాటకీకరణ చేయగా, బీఎంరెడ్డి దర్శకత్వం వహించారు. కొలకలూరి వారి జనరల్ బోగీలు నాటిక ప్రదర్శించారు.

రైలు ప్రమాదాలు జరిగినప్పుడు జనరల్ బోగీల్లో ప్రయాణించే వారి వివరాలు ఉండవని, ప్రమాద వేళల్లో బాధితుల వేదన వర్ణనాతీతమని వివరించారు. పి.టి.మాధవ్ నాటికను రచించగా, గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు. అనంతరం రుతువు లేని కాలం నాటికతో బంధాల విలువలను తెలియజేశారు. ఆగస్త్య రచించగా, వై.బుచ్చయ్యచౌదరి దర్శకత్వం వహించారు. కార్యవర్గ సభ్యులు షేక్ సైదా, ఆవుల సుబ్బారావు, రావుల అంజిబాబు పాల్గొన్నారు.

లైఫ్@360



స్విచాఫ్ ది ఫోన్!

ఓపెన్ ది మైండ్!

ప్రస్తుత కాలంలో ఫోన్‌తోనే ప్రతి ఒక్కరికీ పని. స్మార్ట్ ఫోనే ఫ్రెండ్. ఫోనే పార్ట్‌నర్. సెల్లే సర్వస్వం. అయితే ఓ రోజు ఫోన్ లేకుండా గడిపితే ఎలా ఉంటుంది. వారంలో ఓ రోజు పనికి సెలవు తీసుకున్నట్లే ఫోన్‌కి స్విచ్ ఆఫ్ చేసి పక్కన పడేస్తే..? వారాంతంలో ఓ రోజు పనికి దూరంగా ఉన్నట్లే ఫోన్‌కు దూరంగా ఉంటే ఎలా ఉంటుంది.. అనే ఆలోచన ఊహించడానికే ఏదోలా ఉంది కదా... అదేం కాదు.. ఫోన్ లేకపోతే ఏం జరుగుతుందో చూద్దాం.

చేతిలో ఫోన్ లేకపోతే మెదడు ఓపెన్ అవుతుంది. సొంతంగా ఆలోచించడం ఆరంభం అవుతుంది. ఒకదానితో మరొక విషయాన్ని బేరీజు వేసుకోవడం మొదలుపెట్టే ఖాళీని మెదడుకు ఇచ్చి చూద్దాం.

సెలవు రోజు ఇంటికి అవసరమైన వస్తువులు తెచ్చుకోవడం లేదా ఆర్డర్ చేసుకోవడం వంటి పనులు పూర్తి చేసుకున్న తర్వాత ఇక ఆ రోజుకు ఫోన్ ముట్టుకోవద్దు. ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఇంట్లో పెట్టి కాలనీలో రోడ్లన్నీ చుట్టి వస్తే... మనం నివసించే ప్రదేశం ఎలా ఉందో తెలుస్తుంది. కొత్తగా కడుతున్న ఓ భవనం కనిపిస్తుంది. ఇంతకు ముందు ఈ ప్రదేశంలో ఏముండేది? ఓ ప్రశ్న మదిలో మెదలుతుంది. కానీ సమాధానమే తట్టదు. గడచిన పదేళ్లుగా ఇదే కాలనీలో ఉన్నప్పటికీ వారంలో పది–పదిహేను సార్లు ఇదే దారిలో ప్రయాణించినప్పటికీ మనం ఈ ప్రదేశానికి చిరపరిచితులం కాలేకపోయామా అనే సందేహం కూడా అనిపిస్తుంది. నిజానికి ఈ ప్రదేశానికి మనం చిరపరిచితులయ్యాం, కానీ మనకే ఈ ప్రదేశం చిరపరిచితంగా మారలేకపోయింది. ఒక్కరోజైనా చేతిలో ఉన్న ఫోన్‌ని జేబులో పెట్టుకుని ఈ దారిలో



నడిచి ఉంటే కదా! ఏ విషయమైనా మెదడు గ్రహింపుకు వచ్చేది. అనుక్షణం కళ్లు, చెవులు, మెదడు ఫోన్‌తో ఎంగేజ్ అయి ఉంటాయి. అలవాటు పడిన దారిలో దేహం యాంత్రికంగా సాగిపోతూ ఉంటుంది. పనులు ముగించుకుని ఇంటికి వచ్చి కూర్చున్న తర్వాత కూడా టీవీ స్క్రీన్ మీద దృష్టి కేంద్రీకరిస్తాం. ప్రపంచంలోని విషయాలన్నింటినీ మెదడులోకి గుప్పించడంలోనే రోజు పూర్తవుతుంటే... ఇక మెదడు సొంతంగా ఆలోచించేదెప్పుడు? ఆ మాత్రం వెసులుబాటు దొరికినప్పుడే మెదడు తన సృజనాత్మకతను బయటపెడుతుంది.

ఒక గంటతో మొదలు పెట్టండి!

వారంలో ఓ రోజు ఫోన్, టీవీ, కంప్యూటర్, ట్యాబ్, ల్యాప్‌టాప్ అన్నింటికీ సెలవు ప్రకటించి తీరాలి. మెదడుకు రెక్కలు విచ్చుకుని విహరించే అవకాశం కల్పించాలి. ఒకేసారి రోజంతా అన్ని స్క్రీన్‌లకూ ఆఫ్ అంటే కొంత కష్టం కావచ్చు. టీవీ, కంప్యూటర్‌లైతే మన చేతిలోనే ఉంటాయి. ఫోన్ కాల్స్ మన చేతిలో ఉండవు. ఇంట్లో ఒక ఫోన్ స్విచాఫ్‌లో ఉంటే 'ఫోన్ ఆఫ్‌లో ఉందేమిటి' అంటూ మరొకరి ఫోన్‌కు కాల్స్ వస్తుంటాయి. కాబట్టి మొదట్లో ఒక గంటతో మొదలు పెట్టండి. రెగ్యులర్‌గా ఫోన్ చేసే స్నేహితులు, బంధువులకు 'ఇది స్విచాఫ్ అవర్' అని మెసేజ్ పెట్టేసి ఫోన్ బంద్ చేయాలి. గంటతో మొదలు పెట్టి క్రమంగా 'స్విచాఫ్ డే'గా మార్చాలి. 'స్విచాఫ్ డే' కుటుంబ సభ్యులు ఒకరితో ఒకరు మనసు విప్పి మాట్లాడుకునే రోజవుతుంది. కుటుంబ బంధాలు ఆనందాల హరివిల్లుగా మారుతాయి.

● మీకు తెలుసా

ఎండు పండ్లు ఎంత ఆరోగ్యం?

ఆరోగ్యంగా ఉండాలంటే శరీరానికి తగినన్ని ప్రొటీన్స్, ఫ్యాటీ యాసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్స్, మినరల్స్ అవసరం. వీటన్నింటిని పొందడానికి డ్రై ఫ్రూట్స్ ఒక మంచి ఆప్షన్. అందుకే డ్రై ఫ్రూట్స్ ఆరోగ్యానికి మంచిదని డాక్టర్లతోపాటు చాలామంది తెలిసిన వాళ్లు కూడా చెబుతారు. అయితే అవి ఆరోగ్యానికి మంచిది కదా అని.. ఇష్టమొచ్చినట్టు తింటే



ఆరోగ్యానికి మేలు బదులు ముప్పు వాటిల్లుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు.

అతి సర్వత్రా వర్జయేత్ అన్నారు పెద్దలు. అంటే ఎందులోనూ అతి పనికి రాదన్నమాట. ఈ సూత్రం డ్రై ఫ్రూట్స్‌కి కూడా వర్తిస్తుంది.

డ్రై ఫ్రూట్స్‌లో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అలాగే.. షుగర్స్, క్యాలరీలు కూడా ఉంటాయి. కాబట్టి వీటిని 20 గ్రాముల కంటే ఎక్కువ తినకూడదు. అలాగే నేరుగా తినడం కూడా మంచిది కాదు.

యోగా

భుజబలానికి కీలకం

నేలపైన మ్యాట్ వేసుకొని, శరీరాన్నంతా స్ట్రెచ్ చేస్తూ చేయాలని అందరూ యోగా చేయడానికి సిద్ధ పడరు. అందుకు వయసు, అనారోగ్యం, చిన్న చిన్న గాయాలు వంటివి కారణం అవుతుంటాయి. ఇలాంటప్పుడు కుర్చీ లేదా సోఫాలో కూర్చొని కూడా యోగ సాధన చేయవచ్చు.

ఈగిల్ ఆర్మ్స్ భంగిమ అంటే ఇది గరుడాసనను పోలిన విధంగా ఉంటుంది. ఇందులో కూర్చొనే విధానంలోనే తేడా ఉంటుంది. శరీర కదలికలకు, శ్వాస పనితీరులో మెరుగుకు ఇలా సాధన చేయవచ్చు.





ఇలా ప్రయత్నించవచ్చు..

● కుర్చీలో నిటారుగా కూర్చొని, పాదాలను నేలమీద ఆనించాలి. దీర్ఘశ్వాస తీసుకుని, వదులుతూ చేతులను విశాలంగా గరుడ పక్షి రెక్కల్లా చాచాలి. భుజాలను నిటారుగా ఉంచాలి.

● ఐదు శ్వాసలు తీసుకొని, వదిలిన తర్వాత రెండు చేతులను పైకి ఎత్తాలి. చేతులను సాధ్యమైనంత పైకి సాగదీస్తున్నట్టు ఉంచాలి. ఆ తర్వాత రెండు చేతులను హృదయస్థానానికి తీసుకురావాలి. కుడి చేతిని ఎడమ చెయ్యి కింద నుంచి తీసుకుంటూ వ్యతిరేక దశలో రెండు చేతులను పట్టుకోవాలి. ఈ సమయంలో భుజాలు కూడా కొద్దిగా ముందుగా వంగుతాయి. ఈ భంగిమను రోజూ సాధన చేస్తుంటే ముంజేతుల దగ్గర నుంచి ఒకదాన్నొకటి చుట్టినట్టుగా వస్తుంది. ఐదు దీర్ఘ శ్వాసలు తీసుకొని, వదలాలి. తిరిగి మెల్లగా యథాస్థితికి రావాలి.

● ఇదే విధంగా ఎడమ నుంచి కుడి చేతివైపుకు కూడా చేయాలి. ఒక్కో భంగిమలో ఐదు దీర్ఘ శ్వాసలు తీసుకొని, వదులుతూ సాధన చేయడం వల్ల మానసిక ఒత్తిడి కూడా తగ్గుతుంది.

● కుర్చీ/సోఫాలో కూర్చున్నప్పుడు కాళ్లను కూడా నేల మీద నుంచి వీలైనంత పైకి లేపి, పది సెకన్లు ఉంచి, తిరిగి యథాస్థానంలోకి తీసుకురావచ్చు. ఈ విధంగా చేయడం వల్ల పాదాల వరకు రక్త ప్రసరణ మెరుగవుతుంది.

పాలు... రాగులు ఏవి బెటర్

శరీరానికి కాల్షియం అనేక రోజువారీ పనులు చేసేందుకు ఉపకరిస్తుంది. అందువల్ల మన డైట్‌లో కాల్షియంని చేర్చుకోవడం ముఖ్యం. జున్ను, బొప్పాయి, మల్బరీ, లిచీ, కివి, బచ్చలికూర, బ్రకోలీలో కాల్షియం ఎక్కువగా ఉంటుంది. వీటిని రెగ్యులర్‌గా తినడం వల్ల చాలా సమస్యల్ని దూరం చేసుకోవచ్చు. ఆరోగ్యంగా కూడా ఉంటారు.

పాలు, రాగుల్లో కాల్షియం ఎక్కువగా ఎందులో ఉంటుందంటే...

పాలు, రాగులు రెండూ ఒకదానికి మించి లాభాలని అందిస్తాయి. ఉదాహరణకి..100 మి.లీ పాలు తాగితే 110 మిల్లీ గ్రాముల కాల్షియం లభిస్తుంది. అదే 100 గ్రాముల రాగులని తీసుకుంటే, దాదాపు 350 మిల్లీ గ్రాముల కాల్షియం లభిస్తుంది. ఇందులో ఉండే ఫైబర్ జీర్ణవ్యవస్థని ఆరోగ్యంగా ఉంచితే, ఐరన్ ఎక్కువగా ఉండడం వల్ల రక్తహీనత ఉన్నవారికి రాగులు మంచిది. రాగుల్లో ఉండే పొటాషియం వంటి ఇతర పోషకాలు మొత్తం శరీర ఆరోగ్యానికి సాయపడతాయి. పాలలో పోషకాలతోపాటు ఉండే ఎలక్ట్రోలైట్స్ బాడీని హైడ్రేట్ చేస్తాయి. రాగులు షుగర్ ఉన్నవారికి చాలా మంచిది. ఇందులో ఫైబర్ ఎక్కువగా ఉండి గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. ఇది బ్లడ్ షుగర్ లెవల్స్‌ని నియంత్రిస్తుంది కాబట్టి, మీ అవసరాలని బట్టి ఏది మంచిదో నిర్ణయించుకోవడం ఉత్తమం.



తొక్కలతో మొక్కలకు పోషణ

చాలా మంది వేరుశెనగ పప్పుల్ని తిని.. వాటి తొక్కల్ని పారేస్తుంటారు. అయితే, మనం వేస్ట్ అనుకున్న ఈ తొక్కలతో చాలా ప్రయోజనాలు ఉన్నాయి. వేరుశెనగ తొక్కల్లో నైట్రోజన్, ఫాస్పరస్, పొటాషియం వంటి పోషకాలు ఉన్నాయి. ఇవి మొక్కల ఆరోగ్యాన్ని పెంపొందించడంలో సాయపడతాయి. అంతే కాకుండా వీటిలో ఫైబర్, ప్రొటీన్ కూడా ఉన్నాయి. ఇవి మొక్కలకు తగిన పోషణ ఇస్తాయి. వేరుశెనగ తొక్కల్ని ఉపయోగించి కంపోస్ట్ ఎరువు తయారు చేయవచ్చు. ఇందుకోసం వేరుశెనగ తొక్కల్ని బాగా ఎండబెట్టాలి. ఆ తర్వాత వీటిని బాగా మెత్తగా పొడిలా చేసుకోండి. ఈ పొడిని ఇప్పుడు డైరెక్ట్‌గా కుండీలోని మట్టిలో కలపవచ్చు. వేరుశెనగ తొక్కల పొడిని వాడే ముందు మట్టి బాగా కలియబెట్టాలని మరచిపోకూడదు. ఇలా చేయడం వల్ల మొక్కలకు తగిన పోషణ అంది బాగా పచ్చగా, ఏపుగా పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు.



మరకలు ఇలా మాయం..

ఉన్ని దుస్తుల మీద మరకలు ఏర్పడితే.. వాటిని డైరెక్ట్‌గా వాషింగ్ మెషీన్‌లో ఉపయోగించకూడదు. వాషింగ్ మెషీన్‌లో వేయడానికి ముందు.. సాఫ్ట్ స్టెయిన్ రిమూవర్‌తో మరకల్ని తొలగించాలి. తేలికపాటి లిక్విడ్ డిటర్జెంట్, నిమ్మరసం వంటి వాటిని అప్లై చేసి.. స్టెయిన్ రిమూవర్‌తో మరకల్ని తొలగించడం బెస్ట్ ఆప్షన్. ఆ తర్వాత మరకలు తొలగిన తర్వాత వాష్ మెషీన్‌లో వేసి బట్టలు ఉతకవచ్చు.



మీకు తెలుసా?

చాలా మంది కూల్ డ్రింక్స్ తాగుతుంటారు. అందులోనూ సోడా ఉండే వాటిని ఎక్కువ మంది ఇష్టంగా తీసుకుంటారు. వేసవికాలం, చలికాలం అనే సంబంధం లేకుండా వీటి వాడకం ఎక్కువగా ఉంటుంది. వీటి వల్ల కలిగే ప్రయోజనాల కన్నా... ఆరోగ్య సమస్యలే ఎక్కువ. కూల్ డ్రింకులు, సోడాలు, చక్కెర పానీయాలు తాగడం వల్ల మధుమేహం,ఊబకాయం, కొవ్వు పెరిగి కాలేయం, మెటబాలిక్ సిండ్రోమ్ ప్రమాదాన్ని పెంచుతుంది. కొందరు సోడాకు బదులు డైట్ సోడా తాగితే ఆరోగ్యంపై అంతగా ప్రభావం ఉండదని అనుకుంటూ ఉంటారు. కానీ, మెటబాలిక్ సిండ్రోమ్, అలాగే స్ట్రోక్ ప్రమాదాలను పెంచుతుందని పలు అధ్యయనాల్లో తేలింది. మరి కొన్ని పరిశోధనల ప్రకారం, డైట్ సోడా వినియోగం కూడా ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదాన్ని పెంచుతుంది.



సాక్షి సినిమా

ఊహలకు మించి ఉంటుంది

– బాలకృష్ణ



● ఊర్వశి రౌతేలా, శ్రద్ధా శ్రీనాథ్, బాలకృష్ణ, ప్రగ్యా జైస్వాల్

''సంక్రాంతి పండగకి విడుదలైన నా సినిమాలన్నీ ఘన విజయం సాధించాయి. ఈ సంక్రాంతి కానుకగా రిలీజవుతున్న 'డాకు మహారాజ్' కూడా ఘన విజయం సాధిస్తుంది. ఈ చిత్రం గురించి ప్రేక్షకులు ఏం ఊహించుకుంటున్నారో అంతకు మించి ఈ సినిమా ఉంటుంది'' అని బాలకృష్ణ చెప్పారు. బాబీ కొల్లి దర్శకత్వంలో బాలకృష్ణ హీరోగా నటించిన చిత్రం 'డాకు మహారాజ్'. ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్లుగా, బాబీ డియోల్, ఊర్వశి రౌతేలా కీలక పాత్రలు చేశారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ మూవీ రేపు (ఆదివారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో బాలకృష్ణ మాట్లాడుతూ– ''తిరుపతి తొక్కిసలాట ఘటన నన్ను ఎంతో కలిచివేసింది. 'అఖండ', 'వీరసింహారెడ్డి', 'భగవంత్ కేసరి'.. ఇలా వరుస ఘన విజయాల తర్వాత వస్తున్న 'డాకు మహారాజ్'తో మరో ఘన విజయాన్ని అందుకుంటాననే నమ్మకం ఉంది'' అన్నారు. బాబీ కొల్లి మాట్లాడుతూ–''నా టీమ్‌తో కలిసి ఎంతో శ్రద్ధగా 'డాకు మహారాజ్' కథని సిద్ధం చేశాను. బాలకృష్ణగారితో ఒకసారి పని చేస్తే మళ్లీ పని చేయాలనిపిస్తుంటుంది'' అని చెప్పారు. సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ– ''ఐదేళ్ల క్రితం వైకుంఠ ఏకాదశి రోజున 'అల వైకుంఠపురములో' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ చేసి, జనవరి 12న ఆదివారం సినిమా విడుదల చేశాం. ఇప్పుడు 'డాకు మహారాజ్'కి కూడా అదే జరిగింది. 'అల వైకుంఠపురములో'లాగే ఈ సినిమా కూడా విజయం సాధిస్తుంది'' అని పేర్కొన్నారు. సంగీత దర్శకుడు తమన్ మాట్లాడుతూ–''కొన్ని సినిమాలకు ప్రాణం పెట్టి సంగీతం చేయాలనిపిస్తుంది. అలాంటి సినిమా 'డాకు మహారాజ్'' అన్నారు. ఈ వేడుకలో వైజాగ్ ఎంపీ భరత్, బాలకృష్ణ కుమార్తె తేజస్విని, కెమెరామేన్ విజయ్ కన్నన్, రచయిత మోహన్ కృష్ణ తదితరులు పాల్గొని, 'డాకు మహారాజ్' చిత్రం ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు.

డాల్బీ విజన్‌లో సినిమా చూడటం భిన్నమైన అనుభవం

– రాజమౌళి



''ఆర్‌ఆర్‌ఆర్' సినిమాని డాల్బీ విజన్‌లో గ్రేడ్ చేయాలనుకున్నప్పుడు జర్మనీ వరకు ప్రయాణించాల్సి వచ్చింది. మన దేశంలో డాల్బీ విజన్‌లో నా సినిమాను ఎక్స్‌పీరియన్స్ చేయలేకపోవడం కొంచెం నిరుత్సాహపరిచింది. ఇప్పుడు అన్నపూర్ణ స్టూడియోస్‌లో డాల్బీ విజన్ గ్రేడింగ్ సౌకర్యాన్ని చూసి థ్రిల్ అయ్యాను'' అని దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి చెప్పారు. అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ హైదరాబాద్‌లో సినిమా–హోమ్ కోసం భారతదేశంలో మొట్టమొదటి డాల్బీ సర్టిఫైడ్ పోస్ట్ ప్రొడక్షన్ ఫెసిలిటీ స్టూడియోను నెలకొల్పింది. అన్నపూర్ణ స్టూడియోస్ వైస్ చైర్మన్, హీరో నాగార్జున అక్కినేని సమక్షంలో ఈ స్టూడియోను రాజమౌళి ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ– ''డాల్బీ విజన్‌లో సినిమా చూడటం భిన్నమైన అనుభవం. స్పష్టత, ప్రతి ఫ్రేమ్‌లోని సూక్ష్మ నైపుణ్యాలను పెంచే విధానం కథను పూర్తిగా కొత్త స్థాయికి తీసుకువెళుతుంది. నా తర్వాతి సినిమా విడుదలయ్యే సమయానికి భారతదేశం అంతటా మళ్లీ డాల్బీ సినిమా ఉంటుంది. ప్రేక్షకులు దాన్ని అనుభూతి చెందడం థ్రిల్లింగ్‌గా ఉంటుంది'' అన్నారు. ''అన్నపూర్ణ స్టూడియోస్ 50వ సంవత్సరాన్ని జరుపుకుంటున్న సందర్భంగా వర్చ్యువల్ ప్రొడక్షన్‌లో అగ్రగామిగా ఉండడం, దేశంలో తొలి డాల్బీ సర్టిఫైడ్ పోస్ట్ ప్రొడక్షన్ ఫెసిలిటీ ఫర్ సినిమా–హోమ్‌ను ఏర్పాటు చేయడం గర్వంగా ఉంది. భారతీయ సినిమాలను మ్యాప్‌లో ఉంచడమే మా ప్రయత్నం'' అన్నారు నాగార్జున. అన్నపూర్ణ స్టూడియోస్ ఈడీ సుప్రియ యార్లగడ్డ తదితరులు పాల్గొన్నారు.



''సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలోని 'బ్లాక్ బస్టర్ పొంగల్...' అనే పాట వెంకటేశ్‌గారికి చాలా నచ్చింది. దీంతో ఆయనే స్వయంగా ఆ పాట పాడతానని చెప్పడంతో నేను షాక్ అయ్యాను. కానీ ఆయన 20 నిమిషాల్లో ఆ పాట పాడటంతో సంగీత దర్శకుడు భీమ్స్ కూడా షాక్ అయ్యాడు'' అని డైరెక్టర్ అనిల్ రావిపూడి చెప్పారు. వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్లుగా నటించారు. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా అనిల్ రావిపూడి విలేకరులతో పంచుకున్న విశేషాలు...

సంక్రాంతికే రావాలనుకున్నాం

– అనిల్ రావిపూడి

● వెంకటేశ్‌గారితో నేను తీసిన 'ఎఫ్ 2' (2019) సంక్రాంతికి వచ్చి, విజయం సాధించింది. 'ఎఫ్ 3' కూడా సంక్రాంతికి రావాల్సింది కానీ మిస్ అయ్యింది. మా కాంబోలో మూడో సారి చేసే సినిమాని ఎలాగైనా పండగకి తీసుకొస్తే బావుంటుందని సినిమా ఆరంభం అప్పుడే సంక్రాంతికి రావాలనుకున్నాం. కథ అనుకున్నప్పుడే 'సంక్రాంతికి వస్తున్నాం' టైటిల్‌కి ఫిక్స్ అయ్యాం. 'సంక్రాంతికి వస్తున్నాం' కథ ఒక రెస్క్యూ ఆపరేషన్‌కి సంబధించినది. సెకండ్ హాఫ్‌లో నాలుగు రోజుల ప్రయాణం సంక్రాంతికి ముందు ల్యాండ్ అవుతుంది. ఒక భార్య, మాజీ ప్రేయసి మధ్య నలిగే ఓ భర్త పాత్ర వెంకటేశ్‌గారిది. ప్రతి ఫ్యామిలీ రిలేట్ చేసుకునే సినిమా ఇది. ట్రైలర్ అందరికీ బాగా నచ్చింది. థియేటర్స్‌కి వచ్చాక సినిమా అద్భుతంగా నచ్చితే మూవీ బ్లాక్ బస్టరే. ● కోవిడ్ తర్వాత సినిమా సినారియో మారిపోయింది. మంచి కథ రాసి, గొప్పగా తీస్తే సరిపోదు. థియేటర్స్‌కి జనాలు రాకపోతే సినిమాకి రీచ్ ఉండదు. ఇప్పుడు ఆడియన్స్ బాగా సెలెక్టివ్ అయిపోయారు. మన సినిమా వారి అటెన్షన్‌ని గ్రాబ్ చేస్తేనే ఓపెనింగ్స్ తెచ్చుకోగలమని నా అభిప్రాయం. ఈసారి ప్రమోషన్స్‌పై ఎక్కువ ఫోకస్ పెట్టాం. వెంకటేశ్ గారి లాంటి పెద్ద స్టార్ హీరో సరదాగా అల్లరి చేయడం, రీల్స్ చేయడం ప్రమోషన్స్‌కి చాలా హెల్ప్ అయ్యింది. నేను హీరోలకి ఫ్యాన్‌గానే ఉంటాను. రిలేషన్‌ని పాజిటివ్‌గా ఉంచుతాను కాబట్టి వాళ్ల నుంచి కూడా అంతే ప్రేమ వస్తుంది. ● 'దిల్' రాజుగారితో 'పటాస్' సినిమాతో నా ప్రయాణం ఆరంభమైంది. రాజు గారు, శిరీష్ గారు అంటే నా కుటుంబం లెక్క. మాది పదేళ్ల ప్రయాణం. ఇక ఉమెన్ సెంట్రిక్‌గా ఒక స్పోర్ట్స్ స్టోరీ చేయాలని ఎప్పటి నుంచో ఉంది. కొన్నాళ్ల తర్వాత ఆ నేపథ్యంలో మూవీ చేస్తాను. 'ఎఫ్ 4' సినిమా కచ్చితంగా ఉంటుంది. అయితే దానికి ఇంకా సమయం ఉంది. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకి కూడా ఫ్రాంచైజీలు చేసుకునే అవకాశం ఉంది.

థ్రిల్లర్ రెడీ



● రవి వర్మ, శ్రీవిద్య, పూజా రామచంద్రన్

ధన్యా బాలకృష్ణ, రవి వర్మ, పూజా రామచంద్రన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ మూవీ 'హత్య'. శ్రీవిద్య బసవ దర్శకత్వంలో ఎస్. ప్రశాంత్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో రవి వర్మ మాట్లాడుతూ– ''శ్రీవిద్య కొత్త టైప్ ఆఫ్ మేకింగ్‌కి తెర తీసింది. ఈ చిత్రంలో నేను చాలెంజింగ్ రోల్ చేశాను. ఈ మూవీ ఆడియన్స్‌కు ఓ సరికొత్త అనుభూతిని ఇస్తుంది'' అన్నారు. ''చాలా కాలం తర్వాత 'హత్య' వంటి ఓ డిఫరెంట్ మూవీతో తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాను'' అన్నారు పూజా రామచంద్రన్. ''నా తొలి చిత్రం 'మధ' తరహాలోనే నా రెండో చిత్రం 'హత్య' కూడా థ్రిల్లర్ మూవీ. ప్రేక్షకులు ఈ మూవీని ఆదరించాలి'' అని కోరారు శ్రీవిద్య. ఈ కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ నరేశ్ కుమారన్ .పి మాట్లాడారు.

ఒక పథకం ప్రకారం....

సాయిరామ్ శంకర్ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఒక పథకం ప్రకారం'. వినోద్ కుమార్ విజయన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో శ్రుతీ సోది, ఆషిమా నర్వాల్ హీరోయిన్లుగా నటించారు. సముద్ర ఖని కీలక పాత్ర చేశారు. వినోద్ కుమార్ విజయన్, గార్లపాటి రమేశ్ నిర్మించారు. ఫిబ్రవరి 7న ఈ చిత్రం విడుదల కానుంది. శుక్రవారం ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. వినోద్ కుమార్ విజయన్ మాట్లాడుతూ– ''ఇదొక విభిన్నమైన కథ. అడ్వొకేట్ పాత్రలో సాయిరామ్ శంకర్, పోలీసు పాత్రలో సముద్ర ఖని నటన పోటాపోటీగా ఉంటుంది. ఊహించని మలుపులతో సాగే క్రైమ్, మిస్టరీ కథనాలతో మా సినిమా ఆద్యంతం ప్రేక్షకులను కట్టిపడేస్తుంది'' అని పేర్కొన్నారు.



● సాయిరామ్ శంకర్

ఓటీటీ
ఇది చూడొచ్చు

నాటి రామాయణం నేటి పాత్రలతో.....

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హిందీ చిత్రం సింగమ్ ఎగైన్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



మన ఇతిహాసాలలో గొప్ప విలువలతో కూడుకున్న కథ రామాయణం. నాటి రామాయణాన్ని నేటి నేటివిటీతో ప్రస్తుత ప్రముఖ నటీనటులతో మళ్లీ మన ముందుకు తీసుకు వచ్చే ప్రయత్నం చేశారు బాలీవుడ్ దర్శకుడు రోహిత్ శెట్టి. ఇదే ప్రయత్నాన్ని గతంలో చాలా మందే చేసినా యాక్షన్ నేపథ్యంలో వచ్చిన 'సింగమ్' సిరీస్ చిత్రానికి ఈ తరహా ప్రయోగం చేయడం మొదటిసారి. అందులోనూ బాలీవుడ్‌లో భారీ తారాగణంతో ఇలాంటి అంశంతో కూడిన కథ తీయడమనేది నిజంగా సాహసమనే చెప్పాలి. ముందుగా 'సింగమ్' సిరీస్ గురించి చెప్పుకుందాం. ఈ సిరీస్‌లో వచ్చిన మూడో చిత్రం 'సింగమ్ ఎగైన్'. సిరీస్‌లో ఈ భాగం ప్రేక్షకుల ముందు రావడానికి దాదాపు పదేళ్లు పట్టింది. 2011లో 'సింగమ్' మొదటి చిత్రం రాగా 2014లో రెండో భాగంగా 'సింగమ్ రిటర్న్స్' విడుదలైంది. ఆ తరువాత మూడో భాగం 2024లో 'సింగమ్ ఎగైన్'గా వచ్చింది. అన్ని సిరీస్‌లలో కథానాయకుడిగా ప్రముఖ స్టార్ అజయ్ దేవగన్ నటించారు. ఇకపోతే ప్రస్తుత 'సింగమ్ అగైన్' చిత్రంలో అజయ్ దేవగన్‌తో పాటు కరీనా కపూర్, దీపికా పదుకోన్, అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్, అర్జున్ కపూర్ తదితర ప్రముఖ నటులు నటించారు. రామాయణ కథనే ఇతివృత్తంగా అల్లుకున్న కథ ఇది. రామాయణంలోని పాత్రలను రిలేట్ చేస్తూ ఒక్కో పాత్రను పరిచయం చేస్తూ స్క్రీన్‌ప్లే కొనసాగుతుంది. ప్రత్యేకంగా చెప్పాలంటే సినిమాలో రామాయణ కథను టీవీ షో రూపంలో చూపిస్తూ కథను నడిపిస్తారు. అప్పటి రామాయణ కథ చరిత్రతో మనకు పరిచయం. అందుకే అది రమణీయ కావ్యం. కానీ ఇప్పటి 'సింగమ్ ఎగైన్' రణరంగమే ప్రధాన సూత్రంగా నడిచిన కథ. ఆఖరుగా ఒక్క మాట... రామాయణ కథను నేటి తరానికి మళ్లీ చెప్పడమనేది మంచిదే కానీ, ఎన్నో భావావేశాలున్న రామాయణ మూల కథలోంచి ఒక్క శౌర్య, వీర రసం మాత్రం తీసుకుని సినిమా రూపొందించడం ఏమాత్రం సమంజసమో సినిమా తీసిన దర్శక–నిర్మాతలు, చూస్తున్న మన లాంటి ప్రేక్షకులు ఆలోచించాల్సిందే. ప్రైమ్ వీడియో ఓటీటీ వేదికగా ఈ సినిమా స్ట్రీమ్ అవుతోంది. మీరు కూడా చూసి ఆలోచించడం మొదలు పెట్టండి.

– ఇంటూరు హరికృష్ణ

ఈ మూవీ రివ్యూ వీడియో రూపంలో చూడాలంటే ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.